క్లుప్తంగా

ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

పెగడపల్లి: మండలంలోని ఎల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇమ్యూనైజేషన్, చిన్నారుల టీకాలకు సంబంధించిన డ్యూలిస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల నమోదు, వ్యాక్సినేషన్, పిల్లల వ్యాధి నిరోధక టీకాలను డ్యూలిస్టు ప్రకారం వేయాలని సూచించారు. టీకాలు వేసి వారి వివరాలను ఎప్పటికప్పుడు యూ విన్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. వైద్యాధికారులు నరేశ్, రమ, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణలో కేజీబీవీ విద్యార్థినులు



పీహెచ్‌సీలో పరిశీలిస్తున్న విద్యార్థినులు

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయానికి చెందిన ఎంపీహెచ్‌డబ్ల్యూ మొదటి ఏడాది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. బుధవారం ఆరోగ్యకేంద్రంలో రోగులకు బీపీ, షుగర్ మొదలైన పరీక్షల్లో శిక్షణ పొందుతున్నారు. విద్యార్థులు 4 వారాల పాటు ఆరోగ్యకేంద్రంలో వివిధ రకాల్లో శిక్షణ పొందనున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రజిత, ఉపాధ్యాయులు గీతా, కవిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన మోడల్‌స్కూల్ విద్యార్థులు



పీహెచ్‌సీలో సేవలు వివరిస్తున్న టెక్నీషియన్

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం మోడల్‌స్కూల్ విద్యార్థులు సందర్శించారు. సిలబస్‌లోని ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా పీహెచ్‌సీని సందర్శించి అందులో అందిస్తున్న సేవలను అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి సింధూజ విద్యార్థులకు ఆరోగ్య సలహాలు అందించారు.

విద్యార్థులకు రక్త గ్రూపుల పరీక్ష



రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మల్యాల: మధ్యాహ్న భోజనం వివరాలు నమోదులో మరింత పారదర్శకత కోసం విద్యార్థుల రక్త గ్రూపుల పరీక్షలు నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం తక్కెర్ల రవీందర్ అన్నారు. మల్యాల మండలం లంబాడిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య సిబ్బంది రక్త గ్రూపుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు నూతనంగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో విద్యార్థుల రక్త గ్రూపులుసైతం అప్‌లోడ్ చేయాల్సి ఉండడంతో ఈ శిబిరం నిర్వహించామని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్తయ్య, రమేశ్, నారాయణ, నరేందర్, వేదవతి, షబానా, వెస్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కొండగట్టు: కొడిమ్యాల మండలం డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన ఎల్లె లక్ష్మి అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం లక్ష్మి కూతురు ఎల్లె గంగోత్రి వివాహానికి కమలాకర్‌రెడ్డి రూ.20 వేలు, గాజుల అనూష వివాహానికి రూ.10 వేలు ఆర్థికసాయం పంపించగా, కమలాకర్ అన్న యువసేన తరపున బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గోల్కొండ రాజు, ద్యాగేటి మహిపాల్, చందు, చారి, గాజుల ప్రసాద్, తిరుపతి పాల్గొన్నారు.

ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తా

- వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్



రుద్రవరంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్/వేములవాడరూరల్/కోనరావుపేట/చందుర్తి: మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యలను పరిష్కారిస్తానని, అభివృద్ధి సంక్షేమాల్లో మాట తప్పను, మడమ తిప్పనని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం రుద్రవరం, అనుపురం, నాంపల్లి, కోనరావుపేట మండలం కనగర్తి, సుద్దాల, చందుర్తి మండలం బండపల్లి, కిష్టంపేట, రామరావుపల్లె, ననుగుల గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. మిడ్ మానేరు నిర్వాసితులకు ప్రభుత్వం సరైన నష్టపరిహారం ఇవ్వకపోగా వారిపై అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వారి పక్షాన కాంగ్రెస్ పార్టీ అలుపెరగని పోరాటం చేస్తున్నదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కనుకయ్య, ఎంపీటీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.

బిడ్డ.. ఈసారి నువ్వే గెలుస్తావు

వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామంలో ప్రచారానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌ను 'బిడ్డా ఈసారి నువ్వే గెలుస్తావ్..' అంటూ బొమ్మ ముత్తవ్వ అనే వృద్ధురాలు ఆశీర్వదిస్తూ, రూ.2 వేల నగదును ఆయనకు అందించింది. దీంతో ఆయన ముత్తవ్వ కాళ్లు మొక్కి ఆశీర్వదం తీసుకున్నాడు.



ఆది శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న ముత్తవ్వ

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ కౌన్సిలర్

వేములవాడ: వేములవాడలోని 17వ వార్డు కౌన్సిలర్ వంగల దివ్య–శ్రీనివాస్ దంపతులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

రాళ్లవాగు, సూరమ్మ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం

- వేములవాడ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు



మాట్లాడుతున్న వికాస్‌రావు

కథలాపూర్: రాళ్లవాగు, సూరమ్మ ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని వేములవాడ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్ రావు అన్నారు. బుధవారం కథలాపూర్ మండలంలోని 12 గ్రామాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్నికల ప్రచారం చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాటకు బీజేపీ కట్టుబడి ఉంటుందని, పసుపు బోర్డు తెచ్చి రైతుల్లో ఆనందం తెచ్చిన ఘనత మాదేనన్నారు. రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ రాళ్లవాగు ప్రాజెక్టు కాలువల గురించి పట్టించుకోలేదని, కమీషన్లకు కక్కుర్తిపడి అవినీతిమయమైన పాలన అందించారని మండిపడ్డారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు ఎద్మల వినోద్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు గంగాధర్, వెంకటేశ్వర్‌రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నమనేని విద్యాసాగర్‌రావు

మోదీ పాలనలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు

చందుర్తి: దేశంలో మోదీ పాలన ప్రపంచ వ్యాప్తంగా దేశానికి మంచి గుర్తింపు తెచ్చిందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ అన్ని కులవృత్తుల వారు ఆర్థికంగా ఎదిగేందుకు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాజకీయ నాయకులకు పదవులు శాశ్వతం కాదని, ప్రజలు ఇచ్చి ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చేసి చూపెట్టాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అల్లాడి రమేశ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, సర్పంచ్ ప్రేమలత పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ సర్పంచ్

కోనరావుపేట: మండలం వట్టిమల్ల మాజీ సర్పంచ్ జెట్టి అంజయ్య బుధవారం బీజేపీలో చేరారు.

గంభీర్‌పూర్‌ను మండలం చేయాలని వినతి



ఎమ్మెల్యే,చల్మెడకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. గంభీర్‌పూర్‌తోపాటు పరిసర గ్రామాలను కలిపి మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ శీలం మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కోరుట్ల రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం ఉదయం 9. 30 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ఈజీఎస్ సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

జగిత్యాలటౌన్: ఈనెల 25న అండర్– 14, అండర్ – 17 బాలబాలికల లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీరాం నాయక్ తెలిపారు. ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులు ఎలిజిబిలిటీ ఫాంతో నవంబర్ 25 శనివారం ఉదయం 9 గంటలకు జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

ఎమర్జెన్సీ పోరాట యోధులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

జగిత్యాలటౌన్: లోకతంత్ర జాతీయ నేతల పిలుపు మేరకు రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎమర్జెన్సీ పోరాట యోధుల పెన్షన్ బిల్లు ప్రవేశపెట్టి యోధులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 1975–77వరకు ఎమర్జెన్సీలో సత్యాగ్రహాలు, పోరాటాలు చేసి జైలుకు పోయిన వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక పోరులో ఎందరో యోధులు ఇప్పటికే చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి పెన్షన్ ఇవ్వాలని మాజీ ప్రధాని దివంగత వాజ్‌పేయి, మాజీ ఉప ప్రధాని అద్వానీతో పాటు పలువురు పార్టీ పెద్దలు కూడా చెప్పారని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించిన తీర్మానాలు సైతం ఆమోదించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమర యోధులకు ఇచ్చినట్లుగానే ఎమర్జెన్సీ పోరాట యోధులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, పోచమల్లు,దుబ్బరాజం,ఎండీ కుర్షీద్, ఎండీషమీయొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారత్ సురక్షా సమితి నాయకులు

అయ్యప్ప స్వామి దీక్షలు ప్రారంభం



అయ్యప్ప మాలధారణతో దీక్షాపరులు

మల్లాపూర్: మండలంలోని వాల్గొండ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గురుస్వామి చౌడాల వినోద్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి దీక్ష దారణ ప్రారంభమైంది. పాతదాంరాజుపల్లి, కొత్త దాంరాజుపల్లి గ్రామాలకు చెందిన 25మంది భక్తులు అయ్యప్ప స్వామి మాలధారణ స్వీకరించారు. గురుస్వామి వినోద్ అయ్యప్ప స్వామి దీక్ష నియమ నిబంధనలు భక్తులకు వివరించి అభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మైదాసు శ్రీనివాస్, గురుస్వామి దశరథం, మనోహర్, గడ్డం జలపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, నరేష్, రాకేష్, హనుమాన్ల శివ, రాజేందర్, గంగాధర్,గంగారెడ్డి, రమేష్‌రెడ్డి, సాయిబాబా, హరీష్, సంతోష్, గంగారెడ్డి, నారాయణరెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకటి రోజులే

ధర్మపురి: కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకటి రోజులేనని, 50 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ చేసింది ఏమిటని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని బూరుగుపల్లె, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాల్లో బుధవారం ప్రజా ఆశీర్వాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు, యువకులను అవ్వా మీ ఓటేసీ గెలిపించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్ ఉన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరిక

గొల్లపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఇబ్రాజీపల్లికి చెందిన పలువురు జెడ్పీటీసీ గోస్కుల జలేందర్ ఆధ్వర్యంలో బుధవారం మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

కొప్పుల గెలవాలని మల్లన్నకు ముడుపు

కొప్పుల ఈశ్వర్ భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ బుధవారం పలువురు దివ్యాంగులు మల్లన్నపేట మల్లిఖార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపు కట్టారు.



పార్టీలో చేరిన వారితో మంత్రి కొప్పుల

అందుబాటులో ఉంటా ఆదరించండి

బుగ్గారం : ప్రజలందరికి అందుబాటులో ఉంటా మరోసారి ఆదరించండని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని గోపులాపూర్, చందయ్యపల్లె, చిన్నాపూర్ గ్రామాల్లో బుధవారం రాత్రి గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేశారు.

వేములవాడ రూపురేఖలు మారుస్తా

- యువతకు ఉపాధి కల్పిస్తా
- వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



వేములవాడ: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుతానని బీఆర్‌ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ‘సాక్షి’తో మాట్లాడారు. ఇప్పటికే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబుల కృషితో నియోజకవర్గంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనిస్తోందని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి వేములవాడ రూపురేఖలను మార్చుతానని పేర్కొన్నారు.

సాక్షి: రాజన్నగుడి అభివృద్ధిని ఎలా చేపడతారు ?

చల్మెడ: రాష్ట్రంలోనే ప్రముఖ శివాలయమైన రాజన్న గుడి ఇక్కడే ఉంది. దక్షిణకాశీగా పేరొందిన రాజన్న క్షేత్రాన్ని కాశీ క్షేత్రంగా మారుస్తాం. యాదాద్రి తరహాలోనే రాజన్న ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతాం. ఇప్పటికే రూ.వెయ్యి కోట్ల ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచాం. 35 ఎకరాల భూమి సేకరించి పెట్టాం. వీటీడీఏ, శృంగేరి పీఠాధిపతుల అనుమతులు అందడంతోనే అభివృద్ధి పనులు మొదలవుతాయి. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూనే వారికి ఆహ్లాదాన్ని పంచేలా ఏర్పాట్లు చేయబోతున్నాం.

సాక్షి: ఆలయం, పట్టణం కలిసే ఉన్నాయి కదా.. ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు?

చల్మెడ : మిగతా ఆలయాల కంటే వేములవాడ ఆలయానికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. రాజన్న గుడి, పట్టణం కలిసే ఉంటాయి. ఆలయాన్ని అభివృద్ధి చేస్తూనే సుందరంగా తీర్చిదిద్దుతాం. రోడ్లు విస్తరిస్తాం. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తాం. సెంట్రల్‌లైటింగ్‌తో పట్టణ రూపరేఖలు మార్చేస్తాం. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా, పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం.

సాక్షి: విద్యకు ఎలాంటి ప్రాధాన్యతనిస్తారు?

చల్మెడ: విద్యతోనే సామాజికాభివృద్ధి సాధించవచ్చు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతాం. మహిళా జూనియర్ కాలేజీ, మహిళా డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తాం. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యపై కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంది.

సాక్షి: యువత, ముంపు గ్రామాలకు ఎలాంటి ఉపాధి చూపిస్తారు?

చల్మెడ: యువత, ముంపు గ్రామాల ప్రజల కోసం ఇక్కడికి పరిశ్రమలు తీసుకొస్తాం. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. ఐటీ పార్క్ తీసుకొస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తాం. చేపల పరిశ్రమను ప్రోత్సహిస్తాం.

సాక్షి: ఇది వ్యవసాయ ఆధారిత ప్రాంతం. రైతులను ఎలా ఆదుకుంటారు?

చల్మెడ: ఇప్పటికే ప్రాజెక్టులు నిర్మించాం. కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నాం. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. రానున్న రోజుల్లో మల్కపేట, కలికోట సూరమ్మ ప్రాజెక్టులు పూర్తి చేయబోతున్నాం. ఇప్పటికే రైతులకు ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం. రైతుబంధు అమలు చేస్తున్నాం. పండించిన ప్రతీ గింజను కొంటున్నాం.

సాక్షి: వేములవాడను ఎలా అభివృద్ధి చేస్తారు ?

చల్మెడ : మాది ముందునుంచి రాజకీయ కుటుంబం. మా నాన్న గతంలో మంత్రిగా పనిచేశారు. మేము ఆర్థికంగా స్థిరపడి ఉన్నాం. వైద్యసేవలో కొనసాగుతున్నాం. ఇది నాకు జన్మనిచ్చిన ప్రాంతం కాబట్టి ఈ గడ్డ రుణం తీర్చుకునేందుకు, ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాను. ప్రజలు ఆశీర్వదించి నన్ను అసెంబ్లీకి పంపిస్తే వేములవాడ రూపురేఖలు మార్చేస్తాను.

సాక్షి: మీ గెలుపు కోసం దోహదపడే అంశాలేమిటి ?

చల్మెడ: అరవై ఏండ్లలో చేయలేని అభివృద్ధి కేవలం పదేళ్లలో చేసి చూపింది కేసీఆర్ ప్రభుత్వం. రాష్ట్రంలో మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలంటూ రైతులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు, ఉద్యోగులు, కులసంఘాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు, మేధావులు కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా జనం బ్రహ్మరథం పడుతున్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో నాకు ఓటేసి తప్పకుండా భారీ మెజారిటీతో గెలిపిస్తారని ఆశిస్తున్నా.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం

పెగడపల్లి: హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మన్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు ఓటమి చెందినా ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేశానని, ప్రజలు ఆశీర్వదించి తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గజ్జల స్వామి, మాజీ విండో చైర్మన్ లక్ష్మీనారాయణ, రాములుగౌడ్, సతీశ్‌రెడ్డి, కొమురయ్య, మహేందర్, రవినాయక్, శ్రీనివాస్, విష్ణు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాములపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న లక్ష్మణ్‌కుమార్

వెల్గొండలో కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం

బుగ్గారం: మండలంలోని వెల్గొండ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఇంకెంతకాలం.. ఈ కంపు

మెట్‌పల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఇన్‌గేట్ వద్ద ఉన్న మురికి కాల్వ ఇది. సుందరీకరణ నిధులతో జాతీయ రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. సంబంధిత కాంట్రాక్టర్ కొన్ని చోట్ల ఇలా అసంపూర్తిగా వదలిపెట్టారు. ఇన్‌గేట్ వద్ద ఇరువైపులా ఇలా ఉండడంతో మురుగు నీరు అక్కడే నిలిచి ఉంటుంది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ చేతులెత్తేయడం..మిగతా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మూడేళ్లుగా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. దీనివల్ల దోమలు, దుర్వాసనతో అక్కడ వ్యాపారం చేసుకునే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కంపు ఇంకా ఎంతకాలం భరించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కోరుట్ల రూరల్: కోరిన కోర్కెలు తీర్చే వేంకటేశ్వరునిగా, భక్తులకు కొంగు బంగారంగా ప్రసిద్ధిగాంచిన వెంకటాపూర్ గుట్టపై ఉన్న అతి పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం, భక్తులకు అన్నదానం ఉంటుంది. శనివారం గ్రామ చెరువులో స్వామి వారి తెప్పోత్సవం, ఆదివారం హనుమాన్ వాహన సేవ, సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, మంగళవారం వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు. బుధవారం స్వామి వారి గ్రామ ప్రవేశంతో ఉత్సవాల ముగింపు జరుగుతుంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కటుకం రాజేశ్, సభ్యులు తెలిపారు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న వెంకటాపూర్ వెంకన్న ఆలయం

వచ్చే నెల నుంచి కల్లాలకు వచ్చి పరిశీలిస్తా

సారంగాపూర్: ఎన్నికలు ముగిసిన తర్వాత వచ్చే నెల 10 నుంచి ప్రతీ గ్రామంలోని వడ్ల కల్లానికి వచ్చి దగ్గరుండి ధాన్యం కోతలు లేకుండా తూకం వేయిస్తానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని బట్టపల్లి, పోతారం, బీర్‌పూర్ మండలం బీర్‌పూర్, తుంగూర్, నర్సింహులపల్లె గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు.



పోతారంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ

రాయికల్: మీ అందరిలో ఒకడిగా ఉంటూ ప్రజా సేవ చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైతాపూర్, చెర్లకొండాపూర్ గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామన్నారు.